ఐఐఈఎస్‌టీ ప్రొఫెసర్ పర్యటన

మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఐఐఈఎస్‌టీ ప్రొఫెసర్ సుదీప్తా ముఖోపాధ్యాయ

రెబ్బెన, జూలై 13 : ఐఐఈఎస్‌టీ ప్రొఫెసర్ సుదీప్తా ముఖోపాధ్యాయ(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ శిబ్‌పూర్ వెస్ట్‌బెంగాల్) బెల్లంపల్లి ఏరియాలో శనివారం పర్యటించినట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. ఏరియాలో ముతపడిన డోర్లి-2 ఓసీపీని సందర్శించారు. గని, పరిసరాలు, అక్కడ చేపట్టిన పర్యావరణ, ప్రజాహిత పనులు, కట్టడాలను పరిశీలించారు. అనంతరం నాటిన మొక్కలు, ఎదిగిన వృక్షాలను చూశారు. వాటి నిర్వహణ, సంరక్షణ చర్యల గురించి అడిగితెలుసుకున్నారు. ఆ తర్వాత జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం రవి ప్రసాద్, ఏరియా అధికారులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో పీవో ఉమాకాంత్, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, కార్పొరేట్ అదనపు మేనేజర్లు తిరుపతి, రవీంద్రనాథ్, డోర్లి ఓసీపీ మేనేజర్ మహేశ్, ఎన్విరాన్‌మెంట్ అధికారి రమేశ్, ఫారెస్ట్ అధికారి నవీన్ పాల్గొన్నారు.

'బురదజల్లే ప్రయత్నం మానుకోవాలి'

శ్రీరాంపూర్, జూలై 13 : శ్రీరాంపూర్ సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్‌పై ఇతర ప్రాంతాలకు చెందిన కొందరు కాంట్రాక్టర్లు తమపై నిరాధార ఆరోపణలు చేస్తూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని శ్రీరాంపూర్ అధ్యక్షుడు పుప్పాల సంపత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పింగిలి రాంరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. సంస్థ నిబంధనలకు లోబడే కాంట్రాక్టు పనులు చేపడుతున్నామన్నారు. గోదావరిఖనికి చెందిన ఇద్దరు కాంట్రాక్టర్లు తమ అసోసియేషన్ విచ్చిన్నానికి కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. తమ కాంట్రాక్టర్లు ఎవరిపైనా దాడి చేయలేదని, ఎవరి పనులనూ అడ్డుకోలేదని తేల్చిచెప్పారు. తమపై కులదూషణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. కాంట్రాక్టర్లు కుమార్, స్వర్ణాకర్, రమేశ్, రవీందర్, మధునయ్య, గోపి పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులపై యాజమాన్యం వేధింపులు సరికాదు

సీసీసీ నస్పూర్, జులై 13 : సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులపై యాజమాన్యం వేధింపులను మానుకోవాలని ఇఫ్టూ అనుబంధ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం డిమాండ్ చేశారు. సీసీసీ నస్పూర్ సివిల్ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ.. మెడికల్ క్యాంపుల పేరిట కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నదని ఆరోపించారు. వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు యాదగిరి, రాజేందర్, శంకర్, తిరుపతి, గోపాల్, అప్పారావు, జంపయ్య, రాజు, కొమురయ్య, నాగరాజు, నర్సమ్మ, కమలమ్మ, పుష్ప, శారద, నాగమణి, తిరుమల, గౌరీ, లలిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాలు సాధించాలి

శ్రీరాంపూర్, జూలై 13 : శ్రీరాంపూర్ ఓసీపీకి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని, కార్మికులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఏరియా జీఎం సంజీవరెడ్డి కోరారు. శనివారం ఓసీపీని సందర్శించారు. అలాగే కాంట్రాక్టు సంస్థ సీఆర్‌ఆర్ కాంట్రాక్టు కార్మికుల మెడికల్ క్యాంప్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో పీవో టీ శ్రీనివాస్, ఇన్‌చార్జి మేనేజర్ ఐ శ్రీనివాస్, డీవైసీఎంవో డాక్టర్ రమేశ్‌బాబు, సర్వే ఆఫీసర్ సంపత్, సీనియర్ పీవో శంకర్ పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



పత్తి చేనులో కలియ(డౌర) కొడుతున్న రైతు

పత్తి చేనులో కలుపు తీస్తున్న మహిళలు

చేలలో రైతన్న బిజీ బిజీ

గిరిజన గ్రామాల్లో అకాడీ పండుగ జరుపుకోవడంతో రైతులు చేను పనుల్లో బిజీబిజీగా మారారు. ఉదయాన్నే చేను బాట పడుతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాల వల్ల చేలలో గడ్డి పెరగడంతో డౌర కొడుతున్నారు. మరో వైపు మహిళలు కలుపు తీసే పనుల్లో నిమగ్నమయ్యారు. మళ్లీ భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచిస్తున్న నేపథ్యంలో రెండు రోజుల నుంచి పనులపైనే ప్రత్యేక దృష్టిపెట్టారు. ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తే ఎరువులు, మందులు కొనుగోలు చేసేందుకు ఎదురుచూస్తున్నారు. - కెరమెరి, జూలై 13

శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ధర్నా

శ్రీరాంపూర్, జూలై 13 : సింగరేణి గనుల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా చేపట్టారు. ముందుగా కార్మికుల ర్యాలీని ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య ప్రారంభించారు. గనులు, డిపార్ట్‌మెంట్లు, ఓసీపీల నుంచి కార్మికులు పెద్ద ఎత్తున జీఎం ఆఫీస్‌కు ర్యాలీగా వచ్చారు. ఆనంతరం సీతారామయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య జీఎంకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, నాయకులు రాంచందర్, అఫ్రోజ్‌ఖాన్, రాజయ్య, మురళీచౌదరి, మారపల్లి సారయ్య, దేవేందర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, లక్కిరిరెడ్డి సత్తిరెడ్డి, బాలకృష్ణ, నర్సింగారావు, నవీన్‌రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఐటీ ఫైలింగ్ చేయించాలి

శ్రీరాంపూర్, జూలై 13 : సింగరేణి ఉద్యోగుల 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఐటీ ఫైలింగ్ యాజమాన్యమే చేయించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సురేందర్‌రెడ్డి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేశ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్మికులు ఐటీ ఫైలింగ్ ఫామ్-16, 10ఈ సకాలంలో ఇవ్వకపోవడం, ఇచ్చిన వాటిలో తప్పిదాలు ఉండడంతో ఉద్యోగులు గందరగోళానికి గురికావాల్సి వచ్చిందని పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో సర్వేస్ జనరల్ మజ్దూర్ 108 ఖాళీల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్ వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల మూల వేతనం(బేసిక్)తో సంబంధం లేకుండా భర్తీ చేస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొనడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామనని పేర్కొన్నారు.

కార్మికులపై ఎర్రచట్టాలు

- టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ నాయకుల ఆందోళన

బెల్లంపల్లి, జూలై 13 : సింగరేణి సంస్థలో యాజమాన్యం అవలంబిస్తున్న ఎల్లో, రెడ్ కార్డు వంటి ఎర్రచట్టాలు కార్మికులపై తీవ్ర ప్రభావం చూపుతాయని టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి చంద్రగిరి వెంకటరమణ, సంయుక్త కార్యదర్శులు దాసరి శ్రీనివాస్, సిద్ధంశెట్టి సాజన్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు రాజనాల రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. కలర్ కార్డులతో కార్మికులు ఉద్యోగ భద్రత కోల్పోవడమే కాకుండా ఆందోళన చెందుతారన్నారు. క్రీడల్లో ఇచ్చే ఈ కార్డులను సింగరేణిలో ప్రవేశపెట్టడేమిటని ప్రశ్నించారు. మూడుసార్లు ఎల్లో కార్డు ఇస్తే తద్వారా రెడ్ కార్డు ఇవ్వడం ద్వారా సదరు కార్మికుడికి చార్జిషీట్, సస్పెండ్ చేస్తారని వివరించారు. టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఉన్న సమయంలో కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకువస్తే వెంటనే నిరసన కార్యక్రమాలు చేపట్టి అడ్డుకున్నామని గుర్తు చేశారు. కార్డుల రద్దు విషయంలో ప్రస్తుత గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు నిరహార దీక్షలు, కంటి తుడుపు నిరసన కార్యక్రమాలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నాయని ఆరోపించారు. కార్డుల ఉత్తర్వులను యాజమాన్యం ఉపసంహరించుకోవాలని, లేకపోతే తమ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

ఎస్సీని కలిసిన జీఎం

రెబ్బెన, జూలై 13 : కుమ్రం భీం ఆసిపాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావును శనివారం బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ మార్యాద పూర్వకంగా కలిసినట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. జిల్లా కార్యాలయంలో ఎస్పీని కలిసి, శాలువాతో సన్మానించారు. అనంతరం బెల్లంపల్లి ఏరి యా ఉత్పత్తి, పరిసర ప్రాంతాల అభివృద్ధి కోసం పోలీసు డిపార్ట్‌మెంట్, సింగరేణి కలిసి పనిచేయాల్సిన అవశ్యకతపై చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ సెక్యూరిటీ అధికారి వరప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఎస్పీ డీవీ శ్రీనివాసరావును సన్మానిస్తున్న బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్

'గనుల వేలాన్ని నిరసిస్తూ 15న ధర్నా'

శ్రీరాంపూర్, జూలై 13 : గనుల వేలాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ 15న శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ ఎదుట కార్మిక సంఘాల ఐఖ్య వేదిక (జేఏసీ) ఆధ్వర్యంలో ధర్నా చేయనున్నట్లు హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య తెలిపారు. శనివారం శ్రీరాంపూర్ ఎంవీటీసీని సందర్శించి, కార్మికులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ ఏరియా కార్యదర్శి అనిల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, రమేశ్, శివశంకర్, కనకయ్య, సాగర్, మల్లేశ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

16న ఆయుర్వేద వైద్య శిబిరం

రెబ్బెన, జూలై 13 : సింగరేణి సేవా సమితి ద్వారా మాతా రీసెర్చ్ సెంటర్ హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో బెల్లంపల్లి ఏరియా గోలేటిటౌన్‌షిప్‌లో గల సీఈఆర్ క్లబ్‌లో 16వ తేదీన ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేస్తారని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగులు, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

17న మందమర్రిలో..

మందమర్రి, జూలై 13 : మందమర్రి పట్టణంలోని సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో 17న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరానికి ఇంతకుముందు హాజరైన వారితో పాటు కొత్తగా వైద్యం చేయించుకునే వారు సద్వినియోగం చేసుకోవాలని ఆమన సూచించారు.

నేడు ఆటో డ్రైవర్స్ యూనియన్ ఎన్నికలు

మందమర్రి, జూలై 13 : మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల ఆవరణలో ఆదివారం పట్టణ ఆటో డ్రైవర్స్ యూనియన్ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు యూనియన్ హడ్ హక్ కమిటీ కన్వీనర్ నేరెళ్ల వెంకటేశ్ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ.. పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ముకేశ్‌గౌడ్ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు రమేశ్, శ్రీనివాస్, లక్ష్మణ్, రవి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో పత్తి పంటకు నష్టం

చేనులో నల్లగా మారిన పత్తి పంట

జైనూర్, జూలై 13 : జైనూర్ మండలం బూషిమెట్ట క్యాంప్‌లోని గిరిజన మహిళ కుమ్ర సముద్రబాయికి చెందిన వ్యవసాయ భూమిలో చెట్టుపై శనివారం పిడుగు పడింది. దీని ప్రభావంతో పత్తి పంటకు నష్టం వాటిల్లిందని మహిళారైతు వాపోయింది. ప్రభుత్వం, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు స్పందించి, ఆదుకోవాలని వేడుకున్నది.

వాణిజ్య

డీ-మార్ట్ లాభం 774 కోట్లు

న్యూఢిల్లీ, జూలై 13: డీ-మార్ట్ పేరుతో రిటైల్ అవుట్‌లెట్లను నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.773.68 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అమ్మకాలు పెరగడం వల్లనే గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.658.71 కోట్ల లాభంతో పోలిస్తే 17.45 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 18.57 శాతం ఎగబాకి రూ.11,865.44 కోట్ల నుంచి రూ.14,069.14 కోట్లకు చేరుకున్నది. నిర్వహణ ఖర్చులు 18.62 శాతం పెరిగి రూ.13,056.61 కోట్లకు చేరాయి. ఈ సందర్భంగా అవెన్యూ సూపర్‌మార్ట్స్ సీఈవో, ఎండీ నెవిల్లి నోరోన్హా మాట్లాడుతూ..గత త్రైమాసికంలో కొత్తగా ఆరు స్టోర్లను ప్రారంభించడంతో మొత్తం సంఖ్య 371కి చేరుకున్నాయన్నారు.

5.74 లక్షల కోట్లకు ప్రత్యక్ష పన్ను వసూళ్లు

న్యూఢిల్లీ, జూలై 13: ప్రత్యక్ష పన్ను వసూళ్లలో రెండంకెల వృద్ధి నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 19.54 శాతం పెరిగి రూ.5.74 లక్షల కోట్లు వసూలైనట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ) వెల్లడించింది. కార్పొరేట్ సంస్థలు అధికంగా అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లింపులు జరపడం ఇందుకు కారణమని తెలిపింది. అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు 27.34 శాతం ఎగబాకి రూ.1.48 లక్షల కోట్లకు చేరాయి. దీంట్లో కార్పొరేషన్ ఆదాయ పన్ను(సీఐటీ) వసూళ్లు 1.14 లక్షల కోట్లు కాగా, వ్యక్తిగత ఆదాయ పన్ను (పీఐటీ) రూ.34,470 కోట్లని పేర్కొంది. ఈ నెల 11 నాటికి నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.5,74,357 కోట్లు కాగా, వీటిలో సీఐటీ రూ.2,10,274 కోట్లు, పీఐటీ రూ.3,46,036 కోట్లని తెలిపింది. అలాగే రూ.70,902 కోట్లను రిఫండ్ రూపంలో చెల్లించింది.

లైఫ్ సైన్సెస్ పాలసీ ఎప్పుడో?

4 నెలలు దాటినా ఊసేలేని కొత్త విధానం

లైఫ్ సైన్సెస్ గ్రిడ్ స్ట్రాటజీపై తీవ్ర నిర్లక్ష్యం

ఫార్మా విలేజ్‌ల ఏర్పాటుకు భూముల కొరత

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): దేశ ఔషధ రాజధానిగా హైదరాబాద్‌కు ఉన్న ఖ్యాతి రాష్ట్ర ప్రభుత్వ ఉదాశీనత వల్ల మసకబారే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఫార్మా రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ప్రగల్భాలు పలుకుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. చేతల్లో మాత్రం ఏమీ చేయలేకపోతున్నది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సిద్ధం చేసిన ఫార్మాసిటీని రద్దు చేసి, 3 చోట్ల ఫార్మా విలేజ్‌లను నెలకొల్పుతామని రేవంత్ సర్కారు ప్రకటించినప్పటికీ వాటి జాడ ఎక్కడా కానరావడం లేదు. లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రవేశపెడతామని ప్రకటించి 4 నెలలు దాటినా ఇంతవరకు దాని ఊసే లేదు. కనీసం ఆ దిశగా కసరత్తు జరుగుతున్న దాఖలాలు కూడా లేవు. ఈ నెల 5న హైదరాబాద్‌లో ప్రారంభమైన ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్‌లో ఈ పాలసీని విడుదల చేస్తారని అందరూ భావించినప్పటికీ నిరాశే ఎదురైంది. ప్రస్తుతం ఆ పాలసీపై మాట్లాడేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు. తమకు ఎలాంటి సమాచారం లేదని చెప్తున్నారు. వాస్తవానికి ఫార్మా రంగంలో హైదరాబాద్‌కు ఎన్నో అనుకూలతలు ఉన్నాయి. వాటికి తోడుగా గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి చేసిన ఎకోసిస్టంవల్ల పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. అనేక ఆర్‌అండ్‌డీ కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి లైఫ్ సైన్సెస్ రంగంలో మరింత ఉజ్వల భవిష్యత్తు ఉండనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ, రేవంత్ ప్రభుత్వం నుంచి ఈ రంగానికి ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం అందడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గ్రిడ్ స్ట్రాటజీపై నిర్లక్ష్యం

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని లైఫ్ సైన్సెస్ హబ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించింది. రానున్న పదేండ్లలో లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టంను 100 బిలియన్ డాలర్ల స్థాయికి పెంచాలని, తద్వారా 4 లక్షల ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా లైఫ్ సైన్సెస్ గ్రిడ్ స్ట్రాటజీని ప్రకటించింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని కూడా నిర్లక్ష్యం చేస్తున్నది. రాష్ట్రంలో 10 గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్.. తొలుత నల్లగొండ, మెదక్, వికారాబాద్‌లో సుమారు 1000 నుంచి 2000 ఎకరాల విస్తీర్ణంలో వీటిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇది జరిగి 4 నెలలు దాటినా ఎలాంటి పురోగతి లేదు. క్షేత్ర స్థాయిలో మాత్రం భూముల కొరత వెంటాడుతున్నది. నల్లగొండ, మెదక్‌లో భూములు లేవని కలెక్టర్లు స్పష్టం చేయడంతో వికారాబాద్, జహీరాబాద్‌లో ల్యాండ్ పూలింగ్ విధానంలో ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం హైదరాబాద్ శివార్లలో ఫార్మాసిటీని అభివృద్ధి చేసేందుకు దాదాపు 13 వేల ఎకరాలు సేకరించింది. దీనికి కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులు కూడా రావడంతో భూముల కోసం అనేక కంపెనీలు దరఖాస్తు చేసుకున్నాయి. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దు చేయడం, కొత్త ఫార్మా విలేజ్‌లు ఇంకా కార్యరూపం దాల్చకపోవడంతో పరిశ్రమ వర్గాలు అయోమయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి.



టీ కన్సల్ట్‌ను ప్రారంభిస్తున్న కంపెనీ సీఈవో సందీప్ మక్తల తదితరులు

టీజీఐపీని ప్రారంభించిన టీ కన్సల్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 13 (నమస్తే తెలంగాణ): తెలుగు స్టార్టప్‌లకు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు అందించడమే లక్ష్యంగా ఏర్పాటైన టీ కన్సల్ట్.. తొలి సారిగా గ్లోబల్ ఇన్వెస్టర్ పూల్‌ను ప్రారంభించింది. ఈ విషయాన్ని కంపెనీ సీఈవో సందీప్ మక్తల తెలిపారు. దుబాయ్ వ్యాపారవేత్త బూ అబ్దుల్లాతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు, తద్వారా మన వ్యాపారాలకు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలను అందిపుచ్చుకోవడానికి వీలుంటుందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన అబ్దుల్లా కంపెనీతో టీ కన్సల్ట్ ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా ఎంతో మేలు చేయనున్నదని, ముఖ్యంగా ఆవిష్కరణ రంగంలో ప్రత్యేక నైపుణ్యతను కలిగివున్న తెలుగు వారికి అంతర్జాతీయ అవకాశాలను సొంతం చేసుకునేందుకు ఇది మంచి వేదికని సందీప్ మక్తల తెలిపారు.

బీఎస్ఎన్ఎల్-ఎంటీఎన్ఎల్ విలీనం లేనట్టే!

న్యూఢిల్లీ, జూలై 13: ప్రభుత్వరంగ టెలికం సంస్థలైన బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌లను విలీనం చేసే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తున్నది. కేవలం మహానగర్ టెలిఫోన్ నిగం లిమిటెడ్(ఎంటీఎన్ఎల్)కి చెందిన కార్యకలాపాలను బీఎస్ఎన్ఎన్‌కు అప్పగించేయోచనలో సర్కార్ ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తున్నది. ప్రస్తుతం ఆ దిశగా చర్యలు జరుగుతున్నాయని, దీనికి మరో నెల రోజులు సమయం పట్టే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న ఎంటీఎన్ఎల్‌ను బీఎస్ఎన్ఎల్‌లో విలీనం చేయడం ఎంతమాత్రం సమంజసం కాదని ఆ వర్గాలు భావిస్తుండటం వల్లనే కార్యకలాపాలు మాత్రమే మార్చాలని యోచిస్తున్నది. తొలుత సెక్రటరీల కమిటీ ఈ ప్రతిపాదనను ఉంచిన తర్వాత క్యాబినెట్ ఆమోదానికి పంపిస్తారని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ నెల 20న ఎంటీఎన్ఎల్ బాండ్ల ద్వారా సేకరించిన నిధులకు వడ్డీలను చెల్లించాల్సి ఉన్నది. ప్రస్తుతం ఎంటీఎన్ఎల్..ఢిల్లీ, ముంబైలలో మాత్రమే టెలికం సేవలు అందిస్తుండగా, బీఎస్ఎన్ఎల్ మిగతా దేశవ్యాప్తంగా అందిస్తున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఎంటీఎన్ఎల్ రూ.3,267.5 కోట్ల నష్టం వచ్చింది.

నయా కార్లు వచ్చేస్తున్నాయ్..

న్యూఢిల్లీ, జూలై 13: కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాలు నయా మాడళ్లను అందుబాటులోకి తీసుకోస్తున్నాయి. ప్రస్తుత నెలలో కూడా సరికొత్త మాడళ్లను ప్రవేశపెట్టబోతున్నాయి. వీటిలో టాటా, నిస్సాన్, హ్యుందాయ్, మెర్సిడెజ్, బీఎండబ్ల్యూ వంటి అరడజన్‌కు పైగా సంస్థలు తమ కొత్త మాడళ్లను విడుదల చేయబోతున్నాయి. దీంట్లో ప్రీమియం సెడాన్, లగ్జరీ హ్యాచ్‌బ్యాక్, పలు ఎస్‌యూవీలతోపాటు ఎలక్ట్రిక్ కార్లు కూడా ఉన్నాయి. వీటి వివరాలు..



టాటా కర్వ్ ఈవీ

టాటా మోటర్స్ ఈవీల పరిధిని మరింత విస్తరించడంలో భాగం మరో మాడల్‌ను విడుదల చేయడానికి రెడీ అయ్యింది. టాటా కర్వ్ ఈవీ పేరుతో విడుదల చేయనున్న ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 500 కిలోమీటర్ల వరకు మైలేజీ ఇవ్వనన్నది. ఈ కారు ధర రూ.20 లక్షల కంటే అధికంగా ఉంటుందని అంచనా. 12.3 అంగుళాల టచ్‌స్క్రీన్, 10.25 అంగుళాల డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్ వంటి ఫీచర్స్‌తో తీర్చిదిద్దింది. ఈ మాడల్‌నే ఈ నెల చివర్లో అందుబాటులోకి తీసుకురావాలని చూస్తున్నది.

నిస్సాన్ ఎక్స్-ట్రెల్

దేశీయ మార్కెట్లోకి అడుగుపెట్టి దశాబ్దకాలం పూర్తైన సందర్భంగా నిస్సాన్..ఫోర్త్ జనరేషన్ అవతార్ మాడల్‌ను ప్రవేశపెట్టడానికి సిద్ధమైంది. ప్రీమియం టచ్ ఇన్‌సైడ్, 12.3 అంగుళాల టచ్‌స్క్రీన్, అడాస్, 1.5 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్, 8 స్పీడ్ సీవీటీ ఆటోమేటిక్‌గా ఈ మాడల్‌ను రూపొందించింది.

హ్యుందాయ్ అల్కాజర్ నయా..

అల్కాజర్‌లో నయా మాడల్‌ను మార్కెట్లోకి విడుదల చేయడానికి సిద్ధమైంది హ్యుందాయ్ మోటర్. ఈ నెల చివర్లో అందుబాటులోకి రానున్న ఈ కారు ధర రూ.17 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. పెట్రోల్, డీజిల్ ఇంజిన్‌తో తయారైన ఈ మాడల్‌లో 10.25 ఇంచుల స్క్రీన్, డ్యూయల్-జోన్ క్లైమెట్ కంట్రోల్, వైర్‌లెస్ ఫోన్ చార్జర్, ఏడు ఎయిర్ బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నాయి.

బీఎండబ్ల్యూ 5 సిరీస్

జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ.. ఎనిమిదో జనరేషన్ 5 సిరీస్ మాడళ్లను మార్కెట్లోకి విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే ఈ మాడళ్లు అంతర్జాతీయ మార్కెట్లో లభ్యమవుతున్నాయి. డ్యూ